ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 1 డిసెంబరు 2025 | 5



సైకిల్ ర్యాలీలో ఎస్పీ రాహుల్ మీనా



ఫిట్ ఇండియా!

- అమలాపురంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ
- డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు

అమలాపురం,నవంబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసులు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం అమలాపురంలో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా సండేశ్ ఆన్ సైకిల్, డ్రగ్స్ వద్దు బ్రో.. డ్రగ్స్ రహిత సమాజం మన లక్ష్యం కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గడియారస్తంభం సెంటర్ నుంచి పట్టణంలో వివిధ మార్గాల్లో జరిగిన సైకిల్ ర్యాలీలో జిల్లా ఎస్పీ రాహుల్‌మీనాతోపాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు. చివరకు ర్యాలీ పోలీసు కార్యాలయానికి చేరుకుంది. జిల్లా ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని, ప్రతీరోజు వ్యాయామం చేయాలని, అందులో భాగంగా సైకిల్ తొక్కడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఎస్పీ అన్నారు. డ్రగ్స్ ఉచ్చులో పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్‌బీ సీఐ పుల్లారావు, ఏఆర్‌ఆర్‌ఐ కోటేశ్వరరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, పలువురు అధికారులు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.



అజాత శత్రువు వాజపేయి

సంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నతుడు: కేంద్రమంత్రి

ఏపీలోనే తొలిసారిగా మండపేటలో వాజపేయి విగ్రహం

7

దిత్వాగాలు!

భయపెడుతోన్న మరో తుఫాన్



చివరికిలా : గొల్లప్రోలులో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యపు రాశులు



పి.గన్నవరం మండలం పోతవరంలో ధాన్యం హడావుడిగా పట్టుబడి

- తీవ్ర ఆందోళనలో రైతాంగం
- 50 శాతమే ఒబ్బిడి అయిన పంట
- కళ్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం
- పంట కాపాడుకునేందుకు పరుగులు

పాపం అన్నదాత.. పండించే వరకే పంట అన్నదాత చేతుల్లో ఉంటుంది.. పండించిన తర్వాత ప్రకృతి చేతుల్లో ఉంటుంది.. ప్రకృతి కరుణిస్తే పంట చేతికొస్తోంది.. లేదంటే ప్రకృతిలో కలిసిపోతోంది.. ఆరుగాలం కష్టించిన అన్నదాతను ఇలా నష్టాల పాలు చేస్తోంది.. మొన్న మొంథా... ఆ కష్టం నుంచి అన్నదాత ఇంకనూ తేరుకోలేదు.. ఇంకా పడుతూ లేస్తూనే ఉన్నాడు.. చివరికి ఏదో ఒక విధంగా బయటపడదామనుకుంటుంటే మళ్లీ 'దిత్వా' తుఫాన్ వచ్చిపడింది.. ఎటు నుంచి ఏ కష్టం వస్తుందోనని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.. ఉన్న పంటను కాపాడుకునే పనిలో పడ్డాడు.. పంటను విక్రయించేసిన వాళ్లు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంటుంటే కళ్లాలపై ఉన్న వాళ్లు మాత్రం ఏం జరుగుతుందోననే దిగాలులో ఉన్నారు.. ఆదివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో మరో ప్రమాదం నుంచి బయటపడేందుకు సన్నద్ధమవుతున్నారు. మరో వైపు సముద్రంలోనూ ఈదురుగాలులు వీస్తున్నాయి.. దీంతో ప్రజల్లో అలజడి నెలకొంది..



లోడు క్యూ : ధాన్యం విక్రయాలకు ఇలా

(పిఠాపురం/గొల్లప్రోలు/పి.గన్నవరం/రాజమహేంద్రవరం/సామర్లకోట - ఆంధ్రజ్యోతి)

పంట చేతికందే వేళ వరుస తుఫాన్ హెచ్చరికలు, మారుతున్న వాతావరణం రైతులను కలవరానికి గురిచేస్తోంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, మబ్బులతో కూడిన వాతావరణం, సాయంత్రం చిరుజల్లులతో రైతులు తమ ధాన్యాన్ని మిల్లులు చేర్చే వరకు భయంభయంగా ఆకాశం వైపు చూస్తూ కాలం గడిపారు. ధాన్యం తడవకుండా చూసుకునేందుకు రైతులు పాట్లు పడ్డారు. ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరాయి.

పెరిగిన చలి తీవ్రత

తుఫాన్ ప్రభావమో ఏమిటో కానీ ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి.. భానుడు మబ్బుల మాటున దాక్కునే ఉన్నాడు. ఉదయం నుంచి జనం తట్టుకోలేనంతగా చలి తీవ్రత ఉంది. రాత్రయినా వాతావరణంలో మార్పుకానరాలేదు. పెద్దలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మంకీ క్యాప్‌లు, స్వెటర్లు వేసుకుని తిరిగారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మారిన వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం వాతావరణం మారిపోయింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. పగటిపూటే చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాతానికి పైగా విస్తీర్ణంలో వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. మిగిలిన పంట పొలాల్లోనే ఉంది. కోతలు, నూర్పుళ్లు వేగంగా జరుగుతున్న తరుణంలో దిత్వా తుఫాన్ హెచ్చరికతో ఆదివారం రైతులు వ్యవసాయ పనులు నిలిపివేశారు. ధాన్యం తడవకుండా పరుగులు పెట్టారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుని బరకాలు,టార్పాలిన్లు కప్పారు. వరి కుప్పల్లోకి నీరు చేరకుండా బరకాలు కప్పారు. మరో వైపు మిల్లుల వద్ద ఉన్న లారీలు, ట్రాక్టర్లల్లో ధాన్యం బస్తాలు తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో వైపు గాలుల ప్రభావంతో వరి పంట నేలవాలింది.రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన పంట నేలనంటడంతో గింజ రాలే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాబజార్..

వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యంలో ఎక్కువ శాతాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారు. దళారులు, వ్యాపారుల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. తేమ శాతం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇప్పుడు తుఫాన్‌తో వాతావరణం మారడంతో ఇదే అదనుగా ధాన్యాన్ని తక్కువ కొనేందుకు ప్రయత్నిస్తున్నారు.రెండు రోజుల వ్యవధిలో ధాన్యం బస్తాను రూ.75 నుంచి రూ.125 వరకూ తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన ధరకు అమ్మకుంటే ధాన్యం వర్షానికి తడిస్తే నష్టం మరింత అధికంగా ఉంటుందని భావించి వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు.

'మొంథా' మరువక ముందే...

ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వరిచేలు నేలనంటాయి. దిగుబడి గణనీయంగా తగ్గి నష్టం వాటిల్లింది. ప్రస్తుత తుఫాన్ ప్రభావం మాసూలు చేసుకుంటున్న రైతులపై పడింది. ఎక్కువశాతం రైతులు యాంత్రీకరణ ద్వారానే తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నప్పటికీ వాతావరణం కరుణించకపోతే యంత్రాలు తిరిగే పరిస్థితి ఉండదు. ఒబ్బిడి చేసుకున్న ధాన్యం కనీసం ఒక్కరోజైనా ఎండబెట్టకపోతే తేమశాతం మిల్లర్లు సూచించిన స్థాయికి రాదు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు, మాసూళ్లు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వేచి చూడాలంటున్నారు. ధాన్యం రాశులు తడవకుండా, కుప్పల్లోకి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



ఉప్పాడ తీరంలో అలల ఉధృతి ఇలా..

తీరాన అలజడి

కొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రం నీటిమట్టం పెరగడంతోపాటు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ ఉప్పాడ శివారు కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన బండరాళ్లను తాకుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచీ తీరంలో ఈదురు గాలులు వీచడంతో సముద్రంలోకి వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకొన్నారు.

తూర్పున ఇలా..

ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో సాగు చేయగా 62,712 హెక్టార్లలో కోతలు పూర్త య్యాయి. ప్రస్తుతం కోతలు ఆపేశారు. కళ్లాల్లో సుమారు 30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యం కాగా ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించింది.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 1,67,406 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1,08,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఈస్ట్రన్ డెల్టాలో ముందుగా కోతలు మొదలైనప్పటికీ మొంథా తుఫాన్ ప్రభావంతో స్వర్ణ రకం ఎక్కువ శాతం నేలనంటడంతో పాటు కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.ఈస్ట్రన్ డెల్టాలో ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో, సెంట్రల్ డెల్టాలో 28 వేల ఎకరాల వరకు కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

కాకినాడలో ఇలా..

కాకినాడ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన తాళ్లరేవు, కరప, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం, కోట నందూరు, ఏలేశ్వరం మండలాల్లో మాత్రమే కోతలు ఇంకా మిగిలి ఉన్నాయి. 40 వేల మంది రైతుల సెల్‌ఫోన్లకు వాతావరణ సమాచారాన్ని అందించి జాగ్రత్తలను వివరించాం. డెల్టా ప్రాంత మండలాల్లో 75 శాతం పంటకోతలు పూర్తయ్యాయి. పంట కోతలను ప్రస్తుతానికి ఆపి వేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశించారు.

నేడు పెన్షన్ల పంపిణీ

జిల్లావ్యాప్తంగా రూ.101.74 కోట్లు పంచేందుకు సిద్ధం

అమలాపురంటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద జిల్లాలోని 2,35,729మంది లబ్ధిదారులకు రూ.101.74 కోట్లు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. జిల్లాలోని వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పెన్షన్లతోపాటు ఇతర 26 విభాగాలకు చెందిన వారికి సచివాలయాల వారీగా పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

64 బస్సుల్లో సాంకేతిక లోపాల గుర్తింపు

అమలాపురంటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత-ప్రమాదాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు పలు విద్యా సంస్థలకు చెందిన 143 బస్సులను తనిఖీ చేసినట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో 64 బస్సుల్లో సాంకేతికపరమైన లోపాలను గుర్తించామన్నారు. వారం రోజుల్లోగా లోపాలను సరిచేయించుకోవాలని, అక్కడికక్కడే స్కూలు యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్టు శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్కూలు బస్సుల ఫిట్‌నెస్, అగ్ని నిరోధక పరికరం, అత్యవసర ద్వారం తదితర అంశాలపై దృష్టిసారిస్తున్నట్టు ఆయన తెలిపారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

ధాన్యం రాశులను బరకాలతో రక్షణ కల్పించుకోవాలి

బోసుబాబు,
జిల్లా వ్యవసాయాధికారి

పి.గన్నవరం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో వరి రైతులు రెండ్రోజులపాటు కోతలు వాయిదా వేసుకుంటే మంచిదని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు తెలిపారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో ఈమేరకు ఆయన కొన్ని సూచనలు చేశారు. ఇప్పటికే చేలల్లో ధాన్యం పనలు తడిసిపోయే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పనల మీద ఉన్న చేలల్లో వర్షం ఎక్కువగా పడితే ముందుగా నీటిని బయటకు మళ్లించి అనంతరం ధాన్యం గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని కోరారు. అలాగే ఇప్పటికే కోతలు పూర్తయి రాశులుగా చేసిన ధాన్యాన్ని మెరక ప్రాంతానికి తరలించి బరకాలతో రక్షణ కల్పించుకోవాలన్నారు. అలాగే తడిసిన ధాన్యం రంగు మారకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వీఏఏలు రైతులకుపై అంశాలపై అవగహన కల్పించి అప్రమత్తం చేస్తున్నారని బోసుబాబు తెలియజేశారు.

నిరుద్యోగులకు వర్క్‌ఫ్రం హోం కింద ఉద్యోగ అవకాశాలు

- కౌశలం సర్వేలో నమోదైన అభ్యర్థులకు మాత్రమే
- రేపటి నుంచి సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం

అమలాపురం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు వర్క్ ఫ్రం హోం కింద ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు పూర్తిచేసింది. నిరుద్యోగుల ఆశలను చిగురింపజేస్తూ వర్క్ ఫ్రం హోం కోసం కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబరు 2 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న అభ్యర్థులతోపాటు ఉన్నతస్థాయి విద్యలు అభ్యసించినవారు, పదో తరగతి నుంచి డిప్లమో చదువుకున్న అభ్యర్థులకు కూడా ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్షలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు మల్టీనేషనల్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్న నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఏదొక కంపెనీలో చిరుద్యోగిగానైనా ఉద్యోగ అవకాశం దక్కించుకోవాలని నిరుద్యోగులు ఈ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

సర్వేలో నమోదైన వారికి మాత్రమే..

కౌశలం సర్వేలో ఇప్పటికే నమోదైన నిరుద్యోగులకు సచివాలయాల వారీగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి సచివాలయాలకు ఆన్‌లైన్ పరీక్షల నిమిత్తం వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లను పంపిణీ చేశారు. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణలో భాగంగా ట్రయల్‌రన్ నిర్వహించగా విజయవంతమైంది. జిల్లాలో 81,370 మంది నిరుద్యోగులు కౌశలం సర్వేలో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. వీరికి డిసెంబరు 2 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేలా ఆయా అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సమాచారం ముందుగానే పంపించారు.

సచివాలయాల ఆధ్వర్యంలో పరీక్షలు

గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదైన 81,370 మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేశారు. ఒక్కో సచివాలయంలోను రోజుకు ఇద్దరు చొప్పున ఆన్‌లైన్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. సచివాలయాల పనిరోజుల్లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో సెషన్‌కు ఒక్కో అభ్యర్థి మాత్రమే పరీక్ష రాసేలా శ్లాట్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆ శాఖ చేపట్టింది. డిసెంబరు 2న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సెల్‌ఫోన్లకు ఇప్పటికే సమాచారం పంపించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పావుగంట ముందుగా ఆయా సచివాలయాలకు చేరుకోవాలి. జిల్లాలో గ్రామ సచివాలయాలు 467, వార్డు సచివాలయాలు 48 చొప్పున 515 సచివాలయాల్లో రోజువారీ పరీక్షలు నిర్వహిస్తారు. రోజుకు 1030 మంది అభ్యర్థులు ఆయా సచివాలయాల్లో పరీక్షలు రాయనున్నారు. సుమారు మూడు నెలలకు పైబడి ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ జరుగుతుంది.

హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం 7

పదో తరగతి పరీక్షల ఫీజుకు గడువు పెంపు

ముమ్మిడివరం,నవంబరు30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు మొదట ఈనెల 30వ తేదీ గడువుగా నిర్ణయించినప్పటికీ విద్యాశాఖ దాన్ని పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుంతో 10 నుంచి 12వ తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో 13 నుంచి 15వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు. హాల్ టిక్కెట్‌లో పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదైతే వాటిని సవరించుకోవడానికి డిసెంబరు 16 నుంచి 20వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు.

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు

- 2026 జనవరి 28న కల్యాణం, 29న రథోత్సవం
- తొమ్మిది రోజుల ఉత్సవాలకు ముహూర్తం ఖరారు 7

మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అమలాపురం వేదిక 7



వందేమాతరం 150వ ఉత్సవాల కవిసమ్మేళనంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

వందేమాతరం 150వ ఉత్సవాల్లో కవి సమ్మేళనం అభినందనీయం : బండారు

అలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్రోద్యమంలో వందేమాతరం గీతం కీలకపాత్ర పోషించిందని, ఎందరో దేశభక్తులకు ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం 150వ ఉత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలమూరులో కవిసమ్మేళనం నిర్వహించడం మరింత అభినందనీయమన్నారు. ఆలమూరులో బాల మందిరం, సాహితీగోదావరి సంయుక్త అధ్వర్యంలో ఆదివారం వందేమాతర గీతం 150వ ఉత్సవాల సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు పాల్గొని వందేమాతర గీతం ప్రాముఖ్యతపై కవితలు వినిపించారు. పోటీల్లో విజేతలైన గరగ రామకృష్ణ(కాకినాడ), బుగత యమున(జగ్గంపేట), సూర్యాకుల (ఆలమూరు)లకు మొదటి మూడు స్థానాలు లభించగా, వీరికి ఎమ్మెల్యే బండారు బహుమతులందించారు. కవి సమ్మేళనం నిర్వహకులు కృష్ణశ్రీ, ర్యాలీ శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రాజు, ప్రముఖ కవి గౌరిమల్లిక్, నాయకులు ఆకుల రామకృష్ణ, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, బైరిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష


అమలాపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)ను డిసెంబరు 7న నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్, పాఠశాల లాగిన్ నుంచి, వాట్సాప్-మనమిత్ర ద్వారా అందుబాటులో ఉంటాయన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయ్యి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టిక్కెట్లను డౌన్లోడ్‌చేసి అందించాలని సూచించారు. సంబంధిత విద్యార్థుల వివరాలు ఏమైనా సవరింపులు ఉంటే పాఠశాల హెచ్‌ఎంలతో ధ్రువీకరించిన లేఖతో పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిసి సెంటర్ నామినల్ రోల్‌లో తప్పకుండా నమోదుచేయించుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా విద్యార్థి పరీక్షా కేంద్రాన్ని తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు హాల్ టిక్కెట్లు అందించాలని కోరారు.

జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలు

నేషనల్ మెరిట్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహణకు జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు తెలిపారు. జిల్లాలో 3106 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరు కానున్నారన్నారు. అమలాపురం బాలుర, ప్రభుత్వ, మహాత్మాగాంధీ మున్సిపల్, ఉన్నత పాఠశాల, కొంకాపల్లి జవహర్‌లాల్‌నెహ్రూ హైస్కూలు, విద్యార్థిని స్కూలు, పేరూరు, కొత్తపేట, రత్నంపేట, రామచంద్రపురం కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన జరిగే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ముందుగానే హాల్ టిక్కెట్లు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15 కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి అదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు..... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్టూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ల ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీపీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా ఆరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల అధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3


అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పొలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అఖండ నుంచి అవతార్ వరకూ...
● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్







ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా



'బాలకృష్ణ గారి లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాఇపల్లో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్‌ఎక్స్ ప్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?

అదూర్ గోపాలకృష్ణన్



ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచన లాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ



తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

ఉల్లాసం... ఉత్సాహం!





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన దృశ్యాలు

రాజమహేంద్రవరంలో ముగిసిన గోదావరి బాలోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో 2రోజులపాటు జరిగిన గోదావరి బాలోత్సవం ఆదివారంతో ముగిసింది. చిన్నారులు క్లాసికల్ డ్యాన్సు, సైన్సు ప్రయోగాలు, గణిత పజిల్స్, జానపద నృత్యాలు, కోలాటం, లఘునాటికలు, జానపద గీతాలాపన, చిత్రలేఖనం తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఏ.విశ్వేశ్వరరావు, ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, అపుస్మా జిల్లా కార్యదర్శి పి.కల్యాణ్‌రెడ్డి, ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు మనవడు డెన్నిస్ దామెర్ల, ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి టి.క్రాంతికుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, ప్రధాన కార్యదర్శి డి.సాయిబాబా, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

శుభ ముహూర్తం ఖరారు...

జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2 వరకు అంతర్వేదిలో వార్షిక కల్యాణోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక దివ్య, తిరు కల్యాణ మహోత్సవాలకు శుభ ముహూర్తం ఖరారైంది. తొలుత అర్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు ముహూర్తపు పత్రికను ఆదివారం అందించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ముహూర్త నిర్ణయం ప్రకారం.. 28న రథ సప్తమి పర్వదినం రోజున మొదలుకుని రాత్రి 1.56 గంటలకు స్వామివారి కల్యాణం, 29న గురువారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం, 1న ఆదివారం ఉదయం 8గంటలకు స్వామివారి చక్రస్నానం (సముద్రస్నానం), 2న సాయంత్రం 6 గంటలకు స్వామివారి తెప్పోత్సవం జరుగుతాయి. మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో 9రోజులు స్వామివారు ఒక్కో వాహనంపై గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం (వాహనసేవ) జరుగుతుంది. స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లలో భాగంగా వివిధ శాఖల అధికారులతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి అధ్యక్షతన డిసెంబరు 4న ఉదయం 11 గంటలకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ పేర్కొన్నారు.

అజాత శత్రువు వాజపేయి

ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నతుడు: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

వాజపేయికి మండపేటతో విడదీయని బంధం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఏపీలోనే తొలిసారిగా మండపేటలో వాజపేయి విగ్రహం ఏర్పాటు



సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, హాజరైన ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు



వాజపేయి విగ్రహానికి పూలదండ వేస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాధవ్

మండపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా పనిచేసిన దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయాల్లో అజాత శత్రువని, ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఆదివారం వాజపేయి విగ్రహాన్ని రాజమహేంద్రవరం ఎంపీతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని తాపేశ్వరం వేదుక ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ దేశప్రధానిగా స్వర్ణభూజ్ పథకం గ్రామాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వైద్య టెలికాంరంగాలకు వాజపేయి ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. దేశ సమగ్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విమానయానం ప్రపంచ దేశాలతోపాటు అణుబాంబు తయారీ చేయడం వంటి విషయాల్లో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ధైర్యశాలీ వాజపేయి అని మాధవ్ అన్నారు. వాజపేయికి మండపేటతో విడదీయరానీ బంధం ఉందన్నారు. మండపేటకు 1983లో వాజపేయి వచ్చినపుడు బీజేపీ సీనియర్ నాయకుడు వల్లూరి పార్థసారధి ఇంట ఆతిథ్యం స్వీకరించిన విషయాన్ని మాధవ్ గుర్తుచేశారు. మండపేటలో బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన వాజపేయి విగ్రహం రాష్ట్రంలోనే తొలి విగ్రహమని, ఇక్కడ బీజేపీ శ్రేణుల స్ఫూర్తితో రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాజపేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సభలో మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, యాళ్ల దొరబాబు, సుబ్బారావు, కర్రి చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు

రూ.1000కోట్లు ఖర్చు అంచనా.. ఇప్పటికే రూ.100కోట్ల నిధుల విడుదల

రామవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్, పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించే విధంగా నిర్వహించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్కరాలకు రూ.1000కోట్లు ఖర్చు అంచనా వేయడం జరిగిందని, ఇప్పటికే రూ.100కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పుష్కరాల సందర్భంగా చేపట్టే పనులు పూర్తిస్థాయిలో పటిష్ఠంగా ఉండేలా చర్యలు చేపట్టడం చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పుష్కరాల పనుల ప్రణాళిక కోసం కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటించడం జరిగిందన్నారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీజేపీ యంత్రాంగానికి తగిన సూచనలు, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొన్నారు.

మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు అమలాపురం వేదిక

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు
- పాల్గొన్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ప్రభుత్వ విప్ దాట్ల, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన చైతన్యరాజు, ప్రభుత్వ విప్ సుబ్బరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అమలాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణం వేదిక కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 మార్చి 1వ తేదీన కిమ్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆ సంస్థ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు మహాసభలకు సంబంధించి ఆదివారం కిమ్స్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ ఆర్భాటంగా జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీన జరిగే ఈ మహాసభలను ప్రతీ ఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఘనంగా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాకే గర్వకారణంగా నిలిచే రీతిలో ప్రపంచానికి తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియచేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలసికట్టుగా పనిచేస్తాం...

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ మహాసభలను తాము బాధ్యతగా తీసుకుని 2రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు తామంతా కలసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఇక్కడకు సమీపంలోని ఆంధ్ర, గోవా, కోకో బీచ్‌లో ఏర్పాట్లను చేస్తున్నట్టు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రెస్టారెంటు, వాటర్ స్పోర్ట్స్ బీచ్ వాలీబాల్, ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేకునేలా బీచ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సభలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబుతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ పి.విజయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ మోహనరాజు, ఎస్టీయూ నాయకులు దొరబాబు, పినిపే సత్యనారాయణ, బండారు రామ్మోహనరావు, ఎస్వీ నాయుడు మాట్లాడారు. రాజమహేంద్రవరం వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలు 2 పర్యాయాలు నిర్వహించారని, మూడో పర్యాయం అమలాపురంలో నిర్వహించడానికి నిర్ణయించామని చైతన్యరాజు ప్రకటించడంతో పాటు సభల్లో విద్యార్థులకు తెలుగు భాషా ప్రావీణ్యంలో పలుఅంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా భాషాభిమానాన్ని పెంపొందించడానికి కీలకంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులుపేర్కొన్నారు.

10వేల మందితో శోభాయాత్ర..

సభకు అధ్యక్షత వహించిన కేవీవీ చైర్మన్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ప్రపంచ తెలుగు మహాసభలను జిల్లా ఖ్యాతిని ప్రపంచదేశాల్లో ఇనుమడింపచేసేలా అమలాపురంలో నిర్వహిస్తామని తెలిపారు. 10వేల మందితో ఫిబ్రవరి 28న శోభాయాత్ర పట్టణంలో నిర్వహిస్తామన్నారు. వెయ్యి మందికి పైగా కవులతో సమ్మేళనం, వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎం లతో సహాయ తెలుగుభాష కోసం పనిచేస్తున్న ప్రపంచంలో పేరెన్నిగన్న వ్యక్తులందరినీ ఈ వేదికపైకి పిలిచి సత్కరించనున్నట్టు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి...

బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తరలివచ్చిన ఉపాధ్యాయులు.. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సెల్ఫీలు తీసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న వీసీ, ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. విశ్వవిద్యాలయంలో తొలిసారి తొలి సమావేశంగా జరిగిన ఈ సమ్మేళానికి పూర్వ విద్యార్థులు అనేకమంది వచ్చారు. వారిలో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. వారంతా క్లాస్ రూమ్స్‌కి వెళ్లి అలనాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని, ఇక్కడకు విశ్వ విద్యాలయం రావడంతో తెలుగు భాషా అభిమానిగా తన పాత్ర కూడా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు కూడా ఈ విశ్వ విద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి సమ్మేళనాల వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని, ఇంతమంది ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేకత చెప్పడంతో మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. వీసీ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో ఉన్న శాఖలన్నీ దశలవారీగా ప్రవేశపెట్టి, వచ్చే ఏడాది నుంచి విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టామని, కోర్సుల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చామని, చాలా కోర్సులకు మంచి స్పందన ఉందని చెప్పారు. పూర్వ పీఠాధిపతి బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తరచు కలుసుకుంటూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వీసీ నాయుడికి విశ్వవిద్యాలయంపై పూర్తి అవగాహన ఉందని, ఆయనకు అందరూ సహకరిస్తే బాగా అభివృద్ధి చేయగలరన్నారు. ప్రముఖులు రెంటాల వేంకటేశ్వర్లు, కూర్మయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డ అదరగొట్టింది..

'బాల సాహిత్య బేరీ'లో పాల్గొన్న గురుత్వ సమందా సింగ్



సమందా సింగ్

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డ మడివి గురుత్వ సమందా సింగ్ ప్రపంచ సాహిత్య వేదిక ప్రశంసలు అందుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గూడూరుకు చెందిన మడివి నెహ్రూ దంపతుల పెద్ద కుమార్తె గురుత్వ సమందా సింగ్ భద్రాచలం యజ్ఞా పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. కాగా తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వర్చు వల్ పద్ధతిన బాల సాహిత్య బేరీ పేరిట అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించింది. ఇందులో పాల్గొనే అవకాశం గురుత్వ సమందా సింగ్‌కు కలిగింది. కార్యక్రమం దాదాపు 13 గంటల పాటు సాగింది. ప్రపంచవ్యాప్తంగా 101మంది తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు. కథ, వచన కవిత్వం, గేయం, పద్య విభాగాల్లో ప్రతిభ చాటారు. గురుత్వ సమందా సింగ్ కథ విభాగంలో ఆదివాసీ సంప్రదాయ వేషధారణలో పాల్గొంది. దేశవ్యాప్తంగా ఆదివాసీలు చేసుకునే పేన్ పండుం (ఇలవేల్పులు, పితృదేవుళ్లు) ఇతివృత్తాన్ని కేవలం 3 నిమిషాల్లో వివరించింది. పలు విశ్వ విద్యాలయాల వీసీలు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాలసాహిత్యవేత్తలు గురుత్వ సమందా సింగ్‌పై ప్రశంసలు కురిపించారు. పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ ఉషారాణి విద్యార్థినిని అభినందించారు.

హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం

భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి నేడూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మతాలు, కులాలు, జాతులు, వర్గాల నుంచి మనుషులు స్వేచ్ఛా జీవులు కావాలన్నారు. ఆధునిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ మూఢ విశ్వాసాల్లో ఎందరో కూరుకుపోతున్నారని విమర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ మహాసభలు ఆదివారం అమలాపురం ఎస్టీయూ జిల్లా శాఖ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా సత్యనారాయణ మాట్లాడుతూ హేతుబద్ధ ఆలోచనలతో ప్రతీ వ్యక్తి పాశవిక నిర్ణయాలు తీసుకుని యథార్థాన్ని గ్రహించాలన్నారు. విశ్వ అవగాహనతో జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం, విశ్వ పరిణామం-జీవపరిణామం నిత్య జీవితంలో హేతువాదం అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. నేడూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం గ్రంథాన్ని జనిపెల్ల భీమారావు ఆవిష్కరించి ద్వంద్వ సమీక్ష చేశారు. ఉమ్మడి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డి.రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలీ, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ, డి.ప్రకాష్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా.. వ్యాన్ బోల్తా

ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



ప్రమాద స్థలంలో వ్యాన్, క్షతగాత్రులు



దేవీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా వ్యాన్ బోల్తా పడి ఒకరి మృతిచెందగా ఐదుగురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గండి పోశమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. సాయంత్రం వరకు ఉండి బయలుదేరారు. మద్యంమత్తులో డ్రైవర్ వ్యాన్‌ను నడపడంతో దేవీపట్నం మండలం అంగులూరు గ్రామ శివారుకు వచ్చేసరికి అదుపుతప్పి రహదారి పక్కన లోయలోకి వ్యాన్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో యలమంచిలి మండలానికి చెందిన కంద్రేకుల నరసింహస్వామి (39) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురికి గాయాలు కావడంతో సీతానగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రంపచోడవరం సీఐ సన్యాసినాయుడు, దేవీపట్నం ఎస్‌ఐ షరీఫ్ ప్రమాదస్థలికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దర్శనాలు ఆపినా ఆగని భక్తులు...

గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరుకోవడంతో గత కొన్ని నెలలుగా అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే అంగుళూరు మెట్టపైన అమ్మవారి విగ్రహం ఉండడంతో పోశమ్మ గండి వచ్చిన భక్తులు ఇక్కడే దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అంగుళూరులో బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు జరపడంతో వచ్చిన భక్తుల్లో పలువురు మద్యం తాగి ఇలా ప్రమాదాల బారిన పడు తున్నారని, ఇప్పటికైనా బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిమ్నాస్టిక్స్ ఓవరాల్ చాంపియన్ 'తూర్పు గోదావరి'



బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీలు పద్మశ్రీ, గోపిమూర్తి

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా, రెండో స్థానంలో గుంటూరు జిల్లా, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు బొర్రా గోపిమూర్తి, కర్రి పద్మశ్రీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, సెక్రటరీ పి.శ్రీనివాస్, మాజీ సెక్రటరీ ఎల్.జార్జ్, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి బలం

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు యవనేత సంజీవ్ పేర్కొన్నారు. ఆదివారం పేరవరంలో టీడీపీ కార్యకర్త కోట లక్ష్మణరావు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆయన అందజేశారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో డిసెంబరు 2న నిర్వహించే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ కోరారు. మెర్లపాలెంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు.

నందంపూడిలో ప్రమాదకరంగా సీసీ రోడ్డు

- ప్రధాన రహదారులు గోతులమయం
-ప్రమాదాల బారిన ప్రయాణికులు


నందంపూడిలో రోడ్డు మధ్యలోకి విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

అంబాజీపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తామని నేతలు హామీ ఇచ్చినప్పటికి నేటికి ఆ రహదారులకు మోక్షం కలగడం లేదు. పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు నేటికి అధ్వానంగా గోతులతో దర్శనమిస్తున్నాయి. నందంపూడి, గంగలకుర్రు అగ్రహారం, కె.పెదపూడి తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. కె.పెదపూడి రావులమ్మ ఆలయం పక్కన ఉన్న ప్రధాన రహదారి రాళ్లు లేచిపోయి ప్రయాణించేందుకు ఇబ్బందికరంగా ఉంది. గంగలకుర్రు అగ్రహారం ప్రధాన గ్రామంలోని అప్పర్‌కౌశిక నుంచి రాచపాలెం కౌశిక వంతెన వరకు రహదారి గోతులమయంగా మారింది. చిన్నపాటి వర్షానికి గోతుల్లో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నందంపూడిలో ఐదేళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలోకి విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈగోతుల్లో వాహన చక్రాలు ఉండిపోయి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారుల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దిత్వా తుఫాన్‌తో రైతుల కలవరం

మామిడికుదురు,నవంబరు30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌ప్రభావంతో ఆదివారం ఉదయం ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు కలవరం చెందుతున్నారు. ఆదివారం నుంచి తుంపరగా మొదలైన వర్షం రాత్రికి తీవ్రతరం కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 2700 ఎకరాల్లో సార్వా రైతులు వరి సాగు చేశారు. 500 ఎకరాల్లో కోతలు పూర్తయి ధాన్యం ఒబ్బిడి అయినట్టు సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. నెల రోజుల క్రితం మొంథా తుఫాన్ ప్రభావం నుంచి కోలుకోకముందే మరలా ఈతుఫాన్ తమ నడ్డి విరిచేలా తయారైందని రైతులు వాపోతున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని, చేలో ఉన్న వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తుఫాన్ ప్రభావంతో వరిచేలు కొన్నిచోట్ల నేలనంటాయి. అసలే అంతంతమాత్రంగా దిగుబడి ఉందని, వర్షాలతో ఆ దిగుబడి ఇంకా తగ్గి నష్టం పెరిగే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మామిడికుదురు: నగరంలో నేలనంటిన వరి చేలను పరిశీలిస్తున్న రైతు

నేల పాలవుతున్న పంట

ఉప్పలగుప్తం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను హెచ్చరికలతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి నుంచి వర్షం ప్రారంభం కావడంతో కళ్ళాల్లోని ధాన్యాన్ని రక్షించుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత కోతలు తిరిగి ప్రారంభించవచ్చన్న ఆలోచనతో అన్నదాతలు ఉన్నారు. అయితే అనుకోకుండా గాలులు విజృంభిస్తే పైరు నేలనంటుతుందని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికే పైరు గతంలోని వర్షాలకు ఎక్కువ కాలం నీటిలో ఉంది. ఈకారణంగా పైరు కాండం దాదాపు బలహీన పడింది. ఈసమయంలో కొద్దిపాటి గాలి సంభవించినా పైరు నేలకొరిగే ప్రమాదముందని రైతులు అంటున్నారు. అదే జరిగితే మొత్తం పంట నేలపాలయినట్టేనని ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్‌కు చాలా వరకు పంట నష్టపోయామని, ఇప్పుడు మిగిలింది కూడా చేజారే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో ఆందోళన

అంబాజీపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం వర్షం పడటంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వాతావరణ మార్పులతో ఇప్పటికే కోతలు వాయిదా వేసుకోవాలని అధికారులు రైతులకు సూచించినప్పటికి రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ఎండబోసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించుకున్నారు. రహదారులపై వరి కుప్పలను ఏర్పాటు చేసుకుని వాటిపై బరకాలు కప్పి భద్రపర్చుకున్నారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు పూర్తికాగా కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, పసుపల్లి, ముక్కామల, వక్కలంక, గంగలకుర్రు అగ్రహారం, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో వరి కోతలు సాగుతున్నాయి.

ఆటో డ్రైవర్ నిజాయితీ.. సన్మానం


ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటోలో నగదు బ్యాగ్ మరిచిపోయి వెళ్లిన ప్రయాణికుడికి డ్రైవర్ నగదు అందించి సత్కారం పొందాడు. లంకలగన్నవరానికి చెందిన గనిశెట్టి త్రిమూర్తులు దంపతులు హైదరాబాదు నుంచి ఆదివారం ఉదయం శుభకార్యం కోసం స్వగ్రామం వచ్చారు. ఈక్రమంలో ఈతకోటలో బస్సు దిగి జగ్గన్నపేట వైపు వెళ్తున్న ఆటో ఎక్కి లంకలగన్నవరం చేరుకున్నారు. ఆటో దిగే హడావిడిలో నగదు బ్యాగ్‌ను ఆటోలో వదిలేశారు. ఇంటికి వెళ్లి చూసుకుని జగ్గన్నపేట, ఈతకోట ప్రాంతాల్లో ఆటో కోసం గాలించి చేసేది లేక ఊరుకున్నారు. ఆటో ఈతకోట ఆటోస్టాండ్ కావడంతో డ్రైవర్ శీలం ప్రసాద్ జగ్గన్నపేట నుంచి తిరిగి కడియపులంక వైపు వెళ్తున్నాడు. అప్పటికే ఆటోలో కూలీలు ఉండటంతో బ్యాగ్ జిప్ తీసి కూలీలు పరిశీలించడం డ్రైవర్ గమనించి బ్యాగ్ మీదికాదని వారి దగ్గర నుంచి తీసుకున్నాడు. బ్యాగ్‌లో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆటో డ్రైవర్ లంకలగన్నవరం వచ్చి త్రిమూర్తులు దంపతులకు నగదు బ్యాగ్‌ను అందించాడు. దీంతో ఆ దంపతులు, కుటుంబ సభ్యులు సంతోషించి డ్రైవర్ ప్రసాద్‌కు పారితోషికం అందించి దుశ్శాలువాతో సత్కారించారు. బ్యాగ్‌లో రూ.10వేలు నగదు, దుస్తులు ఉన్నాయని త్రిమూర్తులు తెలిపారు.

సీఎం సహాయనిధి పంపిణీ

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మరమళ్ల క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి గీసాల తులసి కుటుంబానికి మంజూరైన రూ.1.75లక్షలు చెక్కును అందజేశారు.


సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులం

● నాగానంద స్వామీజీ

ఐ.పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులం అనే భావనతో ఉంటేనే హిందూ సమాజం మనుగడ సాధ్యమవుతుందని శృంగవృక్షం పంచమి పీఠాధిపతి పూజ్యశ్రీ సాయిదత్త నాగానందస్వామీజీ భాషించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐ.పోలవరం మండలం మురమళ్ళలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. మురమళ్ళ ఉపమండలం పరిధిలో పెన్మెత్స కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతి ఉపమండలంలో లక్షకు పైగా స్థలాల్లో హిందూ సమ్మేళనం జరుగుతోందన్నారు. ప్రధాన వక్త వీహెచ్‌పీ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్ర కార్యదర్శి ఆకెళ్ళ రవికుమార్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా నిలిచిందన్నారు. అన్ని రకాల బేధభావాలను విడనాడి సమరసతో కూడిన ఆచరణ, జీవన విధానం, విలువలు పునాదిగా కల్గిన కుటుంబ వ్యవస్థ నడుస్తోందన్నారు. శక్తిమంతమైన ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పెన్మెత్స కృష్ణంరాజు, నడింపల్లి సూర్యవర్మ, గొలకోటి వెంకటరెడ్డి, బొంతు కనకారావు, ఏలూరి రాంబాబు, నంద్యాల నరసింహస్వామి, సలాది శ్రీనివాసరావు, బొక్కా లక్ష్మీనారాయణ, గువ్వల నాగరాజు, నూలు వల్లీతాయారు, వాసంశెట్టి ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.


మురమళ్ళలో అనుగ్రహ భాషణ చేస్తున్న పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానంద స్వామీజీ

కూటమి పాలనలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, పరిశీలకుడు గుబ్బల శ్రీనివాస్

ఉప్పలగుప్తం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం మండలంలో బూత్ కమిటీల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. మండల పరిశీలకుడు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బూత్ కమిటీల సమావేశాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఓట్ల శాతం తక్కువగా ఉన్న బూత్‌లపై సమీక్ష నిర్వహించారు. బూత్ కన్వీనర్లు ఈఅంశాన్ని సీరియస్‌గా తీసుకుని రాబోయే స్థానిక ఎన్నికల నాటికి పరిస్థితిని చక్కదిద్దాలని పరిశీలకుడు శ్రీనివాస్ సూచించారు. అన్నిప్రాంతాల్లోని కుటుంబాలకు ఏదో ఒక కేటగిరీలో సంక్షేమ లబ్ధి అందిస్తున్న కూటమి పట్ల ప్రజలు సానుకూలంగా వ్యవహరించేలా కన్వీనర్లు కృషి చెయ్యాలన్నారు. ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి,వానపల్లిపాలెం, పేరాయిచెరువు, సన్నవిల్లి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, రవణం మధు, చిక్కం పెద్దబ్బులు, పెయ్యల దుర్గారావు, నల్లా బాబండి, చిక్కం పెదబాబు, గనిశెట్టి రాము, లంకే బీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్, ఈదరపల్లి శ్రీనివాసరాజు సలాది శ్రీనివాసరావు, మధుర ప్రతాప్, బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

జిల్లాలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్


అమలాపురంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ వీరబాబు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి అసాంఘిక శక్తులు, రౌడీఇజం, గూండా ఇజాలకు తావు లేకుండా ఉక్కుపాదంతో అణచివేస్తామని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వారిపై పాత నేరాలను పునరావృతం చేసేవారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీలకు కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి ఆదివారం ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం. నేర చరిత్రను విడిచిపెట్టి మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశనం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఈ సందర్భంగా హెచ్చరించారు.

బౌద్ధస్థూప ప్రచార రథయాత్ర

ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బౌద్ధస్థూప ప్రచార రథయాత్ర ఆదివారం ముమ్మిడివరం, కొమానపల్లి, అన్నంపల్లి, కర్రివానిరేవు, కొత్తలంక, అయినాపురం తదితర గ్రామాల్లో ఆదుర్రు ప్రాచీన బౌద్ధస్థూప ప్రచార రథయాత్ర కొనసాగింది. ఈయాత్రకు బౌద్ధులు, బౌద్ధ అనుచరులు, అంబేద్కరీయులు గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. ఈరథయాత్రను ఉద్దేశించి అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ బుద్ధిజం ద్వారానే మనిషికి ప్రజ్ఞ, శీల, కరుణ అలవడుతుందన్నారు. నిజమైన సమాజాభివృద్ధి కావాలంటే బౌద్ధమే మార్గమన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకట్రావు, కేఎస్ఎన్ మూర్తి, కవి, కాశి బాలమునికుమారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అందించిన సేవలే గుర్తింపునిస్తాయి

ఐ.పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన సేవలే తగిన గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆకుల వెంకటేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. వెంకటేశ్వరరావు దంపతులను రాజశేఖర్ సత్కరించారు. వెంకటేశ్వరరావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, సొసైటీ డైరెక్టర్ మద్దిరెడ్డి కుమార్, హెచ్ఎం వీధి సురేష్‌బాబు, యు.వెంకట్రావు, దంగుడుబియ్యం నారాయణరావు, ఆకెళ్ళ సూర్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో పయనించిన రమణయ్య



ఉప్పలగుప్తం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి కోనసీమ వ్యాప్తంగా తనదైన ముద్ర వేసిన మాజీ ఎమ్మెల్యే దివంగత బత్తుల వెంకటరమణయ్య సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. మాలమహానాడు అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి అధ్యక్షతన ఆదివారం భీమనపల్లి బాలుర సంక్షేమ వసతి గృహం వద్ద బీవీ రమణయ్య చిత్రపటాన్ని నాయకులు ఆవిష్కరించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, పెయ్యల శ్రీనివాసరావు, పి.చిట్టిబాబు, పెయ్యల పరశురాముడు, రేవు తిరుపతిరావు, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

భీమనపల్లి హాస్టల్ వద్ద బీవీ రమణయ్య చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్పీఐ నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ముమ్మిడివరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 50ఏళ్ల క్రితం కలసి చదువుకున్నారు. వీరందరూ ముమ్మిడివరం జిల్లాపరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించిన వారే. 1969-74లో 6వ తరగతి నుంచి 10వ తరగతి బ్యాచ్‌కు సంబంధించి విద్యార్థులు ఆదివారం ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. ముందుగా ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.హనుమంతరావు, అప్పటి ప్రధానోపాధ్యాయుడు కోర్ల సుబ్బారావు చేతులమీదుగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం శివాలయం వద్ద ఉన్న నలమాటి నాగబాబు కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. 70మంది వరకు కలుసుకుని తాము చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి పనులను, ఉపాధ్యాయులను తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు చివుకుల శ్రీరామచంద్రమూర్తి, పెద్దింటి శోభనాచార్యులు, సలాది దొరయ్యనాయుడు, జగతా కేశవరావు, శర్మలను పూర్వవిద్యార్థులు పెన్మెత్స జగ్గప్పరాజు, గుద్దటి జమ్మి, జగతా బాబ్జి, మానేపల్లి సత్యనారాయణ సత్కరించారు.

జాతీయ స్థాయి జుజిట్సు పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యశస్విని, వినీష

అమలాపురంటౌన్,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జుజిట్సు పోటీలకు అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థినులు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి అండర్-16 52 కిలోలలోపు విభాగంలో బొలిశెట్టి యశస్విని, 60కిలోలలోపు విభాగంలో చెల్లుబోయిన వినీషసుసత్య అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రథమస్థానాలు సాధించి స్వర్ణ పతకాలు దక్కించుకున్నారన్నారు. డిసెంబరు 19నుంచి 24వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులను ప్రిన్సిపాల్ నంద్యాల మనువిహార్ అభినందించారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి కల్యాణంరమణీయంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

నేదునూరులో ఉచిత వైద్య శిబిరం



అయినవిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేదునూరులో రవి ఈఎన్‌టీ అండ్ ఎండోస్కోపిక్ సెంటర్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్ సమస్యలు ఉన్న రోగులకు డాక్టర్ కాశిన రవికుమార్ ఆధ్వర్యంలో 140మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావిఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో నిర్వహించే స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విశాఖపట్నం సిరిపురానికి చెందిన కేతినీడి అరుణ రూ.50వేలు విరాళంగా సమర్పించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టేకిశెట్టిపాలెం విజేత పబ్లిక్ స్కూలు ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికైంది. గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశ్రీ కళావేదిక చైర్మన్, డాక్టర్ కత్తిమండ ప్రతాప్ విచ్చేసి మాట్లాడారు. నాటకాలు, నాటికలు, ఏకపాత్రలు, ట్రాక్ సింగింగ్, కూచిపూడి, మ్యూజిక్ తదితర కళా ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్ దేవిదుర్గ తాతయ్యనాయుడు, ఉపసర్పంచ్ కటికిరెడ్డి మహేష్, బీజేపీ నాయకులు మాలే శ్రీనివాసనగేష్, మాజీ సర్పంచ్ గెడ్డం పేర్రాజు, విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్టుకు అధినేత నల్లా ప్రకాష్, నటుడు మోరం నాయుడు, సభ్యులు చొప్పల రామారావు, కడలి కృష్ణారావు, అల్లూరి జానకిరామరాజు, వాకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాటిపాకలో మోటారుసైకిల్ దగ్ధం



రాజోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో శ్రీఅన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఉన్న జాతీయ రహదారి 216పై శనివారం రాత్రి మోటారుసైకిల్ దగ్ధమైంది. సినీ హీరో మహేష్‌బాబు నటించిన బిజినెస్ మేన్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా అభిమానులు హంగామా చేశారు. ఎన్‌హెచ్216 రహదారిపై అభిమానులు మోటారుసైకిల్‌పై చక్కర్లు కొడుతుండగా ఒక్కసారిగా ఒక అభిమానికి చెందిన మోటారు సైకిల్ నుంచి మంటలు వ్యాపించి అక్కడికక్కడే దగ్ధమైంది. రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్‌ను వివరణ కోరగా మాకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న దేవదాయశాఖ ఆర్జేసీ



ఐ.పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధరావు దంపతులు ఆదివారం మురమళ్ళ వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆర్జేసీ దంపతులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఆర్జేసీ దంపతులకు ప్రత్యేక దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అందించారు. అసిస్టెంట్‌కమిషనర్ వి.సత్యనారాయణ ఆర్జేసీ దంపతులకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, అర్చకుడు ఉండి దత్తుశర్మ పాల్గొన్నారు.

కౌలు రైతులకు బరకాల పంపిణీ

ఐ.పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద కౌలు రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.1,500 విలువైన బరకాలను 70మంది రైతులకు పంపిణీ చేశారు. సొసైటీ కార్యదర్శి గాడి శ్రీను సహకారంతో పంపిణీ జరిగింది. సొసైటీ కార్యక్రమాలను ఎమ్మెల్యే అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం

మామిడికుదురు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన బొక్కా వెంకటేశ్వరరావు-సంధ్యారాణి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఆదివారం స్వామివారిని 3,800మంది భక్తులు దర్శించుకుని నిత్యాన్నదానంలో 2వేల మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,79,980 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

'ఎస్ఐఆర్'లో నమోదు పొడిగింపు

యానాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియను డిసెంబరు 11వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబరు 4వతేదీతో గడువు ముగియాల్సి ఉండగా మరో వారం రోజులు గడువు(11వరకు) పొడిగించారు.పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ నమోదు పక్రియ విజయవంతంగా జరుగుతోంది. పుదుచ్చేరిలో 30వ నియోజకవర్గమైన యానాంలో ఇప్పటివరకు 40,043మంది ఓటర్లకు 35,973మంది ఓటర్ల వివరాలను ఎస్ఐఆర్‌లో డిజిటలైజేషన్ (90శాతం) చేశారు. ఓటర్లు తమ ఫారాలను డిసెంబరు11వ తేదీలోగా ఇవ్వాలి. డిసెంబరు 16న డ్రాఫ్ట్ఎలక్ట్రోరల్, తుది జాబితాను ఫిబ్రవరి 14న ప్రచురిస్తారు.

మద్దింశెట్టికి నివాళి

యానాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): యానాంమాజీ మేయర్ మద్దింశెట్టి సత్యానందం వర్ధంతిని యానాం సమాచార శాఖ ఆదివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని సత్యానందం విగ్రహానికి యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి, ప్రభుత్వాసుపత్రిడీడీ డాక్టర్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు, ఎస్పీ వరదరాజన్, ఎస్ఐలు పూనిత్‌రాజా, శేరు నూకరాజు, మద్దింశెట్టి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాచారశాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


అమలాపురంలో హనుమద్వ్రత పూజా మహోత్సవాల్లో భాగంగా రథోత్సవం

అమలాపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక యర్రమిల్లివారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీసకలకార్యసిద్ధి మరకత హనుమాన్ మందిరం వద్ద హనుమద్వ్రత పూజా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద నుంచి స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల మీదుగా రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్, సభ్యులు, ఆకొండి రవీంద్ర, మహేష్‌శర్మ, రామబ్రహ్మ పతంజలి, భరద్వాజ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు. మూడు రోజులుగా జరిగిన సంస్కృతి ఉత్సవ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సోమవారం బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహిస్తామన్నారు.

ఘనంగా అన్నసమారాధన

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పిల్లావారి చెరువుగట్టు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద షష్టి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన జరిగింది. వెయ్యి మంది భక్తులు స్వామి-అమ్మవార్లను దర్శించుకుని అన్నసమారాధనలో పాల్గొన్నారు.

పశుసంవర్ధక జిల్లా అధికారి వెంకట్రావు దంపతులకు సన్మానం

అమలాపురం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కొమ్మా వెంకట్రావు ఉద్యోగ విరమణను పురస్కరించుకుని పేరూరు ఫంక్షన్ హాలులో వీడ్కోలు సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్రావు దంపతులను పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, డాక్టర్ చీకట్ల వెంకటనారాయణ, డాక్టర్ మాధురి, సాయినాథ్, పట్టాభి తదితరులు సత్కరించారు.





వాడపల్లి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కిటకిటలాడిన వాడపల్లి ఆలయం

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తజనం స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. స్వామివారికి ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం, నివేదన కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన వీసపాటి సూర్యనరసింహశ్రీనివాస్, సత్యసూర్య పౌర్ణిమ దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించారు. ఆళ్వార్లకు సేవాకాలం, ద్రవిడ వేద పారాయణ నిర్వహించారు. సాయంత్రం పల్లకీ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం, నివేదన తదితర కార్యక్రమాలతో తిరుమంగయ్యి, ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. తొలిరోజు ఉత్సవంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

నవజనార్దనస్వామి ఆలయాల్లో భక్తుల సందడి



నవజనార్దన ఆలయాలకు తరలివచ్చిన హైదరాబాద్‌కు చెందిన భక్తులు

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోనున్న నవజనార్దనస్వామి ఆలయాలకు ఆదివారం హైదరాబాద్ నుంచి పలువురు భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని ఆలమూరు, జొన్నాడ, మడికి నవజనార్దనస్వామి ఆలయాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీటితోపాటు ధవళేశ్వరం, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేటలలో ఉన్న జనార్దనస్వామిలను దర్శించుకున్నట్టు వారు తెలిపారు. ఆలమూరు వచ్చిన సందర్భంగా ఆలమూరు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్వాగతం పలికారు.



బడుగువానిలంకలోనున్న విజయదుర్గ అమ్మవారు

విజయదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం బడుగువానిలంకలోని లంక భూముల మధ్యలో ఉన్న విజయదుర్గ అమ్మవారి మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. లంక రైతుల ఆరాధ్య దైవంగా అమ్మవారిని కొలుస్తారు. ఆలమూరు మండలంతోపాటు, ఆత్రేయపురం, రావులపాలెం, కడియం తదితర మండలాలకు చెందిన రైతులు ఇక్కడ పంట భూములు సాగు చేస్తుంటారు. దీంతో ఆయా ప్రాంతాల రైతులు కుటుంబ సమేతంగా ఇక్కడికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం జరిగిన ఈ మహోత్సవానికి భక్తులు పోటెత్తడంతో జనసంద్రంగా మారింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంతర్వేది ఆలయంలో భక్తుల రద్దీ

అంతర్వేది, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విశాఖపట్నంకు చెందిన కేతినీడి అరుణ రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటంతో పాటు, ప్రసాదం అందజేశారు.

నాణ్యతను గాలికొదిలేశారు

• సైఫాన్ వద్ద ధ్వంసమైన ఆర్అండ్‌బీ రహదారి • గుంతలతో వాహనదారుల అగచాట్లు • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ వద్ద నిర్మించిన ఆర్అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో అనతికాలంలో రోడ్డు కుంగి అధ్వానంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యతను పరిశీలించాల్సిన క్వాలిటీ కంట్రోల్ విభాగం మొద్దు నిద్రలో ఉండటంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారం పనులు చేపట్టారన్న ఆరోపణ లున్నాయి. దీంతో కొద్దిరోజులకే రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ వద్ద రూ2.72 కోట్లతో భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. ఇందులో భాగంగా బొబ్బర్లంక-అమలాపురం ఆర్అండ్‌బీ రహదారిని రెండు ప్రాంతాల్లో సుమారు 30 మీటర్ల పొడవునా రోడ్డును తొలగించి సైఫాన్ నిర్మాణ పనులు చేపట్టారు. తొలగించిన ప్రాంతంలో రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, దీని నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో కొద్దిరోజులకే కుంగిపోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో వాడాల్సిన మెటీరియల్ సక్రమంగా వాడకపోవడంతో ధ్వంసమైందని పలువురు ఆరోపిస్తున్నారు. వీటి పనులను ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షించకపోవడంతో సదరు కాంట్రాక్టరు నాణ్యతను గాలికొదిలేయడంతో ఇటువంటి దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సైఫాన్ నిర్మాణం కారణంగా రెండుచోట్ల తొలగించిన ఆర్అండ్‌బీ రోడ్డును మొక్కుబడిగా పనులు చేపట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ ఈ రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాడపల్లి ఆలయానికి వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందని వాహనదారులు పేర్కొంటున్నారు.



లొల్ల సైఫాన్ వద్ద ధ్వంసమైన ఆర్అండ్‌బీ రహదారి

శ్రీవరప్రకాష్ మరణం తీరనిలోటు

• సంతాప సభలో మంత్రి సుభాష్, పలువురు ప్రజా ప్రతినిధులు

మండపేట నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మరణం టీడీపీకి, పట్టణానికి తీరని లోటని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండపేటలో ప్రకాష్ సంతాప సభను ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్స్ భవనంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు జిల్లా నలుమూలలనుంచి వచ్చిన కూటమినేతలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత మంత్రి సుభాష్, దివంగత ప్రకాష్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆయనతో తనకున్న స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రకాష్ మరణం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ తన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయం కోసం పనిచేసిన ప్రకాష్ సేవలు మరువలేనన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకాష్ మరణం తనకు, పార్టీకి తీరని లోటని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి మాట్లాడుతూ ప్రకాష్ మరణించటం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాట్లాడుతూ తాను 30 సంవత్సరాల నుంచి ప్రకాష్‌తో కలిసి ఉంటున్నానని ఆయన మరణం తీరనిలోటన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వీరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు తదితరులతో పాటు పలువురు ప్రతినిధులు, ప్రకాష్ అభిమానులు పాల్గొని ప్రకాష్ చిత్రపటానికి నివాళులర్పించారు.



ప్రకాష్ సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ప్రకాష్ మృతి తీరనిలోటు

సంతాప సభలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మరణం తీరని లోటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట రెడ్డి వెంకాయమ్మ కమ్మ మహాజన సంఘ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాష్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి రాధాకృష్ణ, వల్లూరి చిన్నారావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ప్రకాష్ చిత్రపటానికి పులువురు నివాళులర్పించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఆలమూరు మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, వల్లూరి పార్థసారధి, పలువురు సంఘీయులు ప్రకాష్ చిత్రపటానికి నివాళులర్పించారు.





కె.గంగవరం మండలం యండగండిలో ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు. పక్క చిత్రంలో రావులపాలెంలో ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

వాతావరణం మార్పుతో రైతుల్లో కలవరం

కె.గంగవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమైంది. దీంతో వరి పంట మాసూళ్లు చేసుకున్న రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 90శాతం వరి పంటను యంత్రాల ద్వారా కోసి తేమ శాతం తగ్గించుకునే పనిలో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వర్షం కురవడంతో రైతులు పంటలను రక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారు. కొందరు రైతులు దగ్గరలో ఉన్న మిల్లులకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా చేతికి అందివచ్చిన పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరికోతలు ప్రారంభం కాగా స్వర్ణరకం మాసుళ్లు రైతులు పూర్తి చేసుకున్నారు. 1318 రకం మాసుళ్లు చేసుకుంటున్న తరుణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురవడంతో కోసిన పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు తలమునకలవుతున్నారు. ఇదిలా ఉంటే వరికోత యంత్రాలను తీసుకు వచ్చిన మధ్యవర్తులు సిండికేటుగా మారి రైతుల అవసరాన్ని సొమ్ము చేసు కుంటున్నారు. ఖరీఫ్ కోతలు ప్రారంభ దశలో గంటకు రూ.2,800 నుంచి రూ.3,000 వరకూ రైతులు యంత్రాలకు చెల్లించేవారు. ప్రస్తుతం గంటకు రూ.3,400 ధర పెంచి దళారులు సొమ్ము చేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.



బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న యువనేత సంజీవ్

కార్యకర్తలే టీడీపీకి బలం

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు యవనేత బండారు సంజీవ్ పేర్కొన్నారు. ఆదివారం పేరవరంలో టీడీపీ కార్యకర్త కోట లక్ష్మణరావు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో వారి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ముళ్ళపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో సమావేశమైన వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు

ప్రభుత్వం దృష్టికి రైతు, మార్కెట్ కమిటీల సమస్యలు

ద్రాక్షారామ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల జిల్లా సమావేశం తీర్మానించింది. రాష్ట్రస్థాయిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల సమావేశం డిసెంబరు 7న జరగనున్న నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్ల సమావేశం జరిగింది. సమావేశంలో రైతులకు ఉపయోగపడే పుంతరోడ్ల నిర్మాణం, రైతులకు అవసరమైన ఇతర సదుపాయాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల సమస్యలను రాష్ట్ర సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశంలో చైర్మన్లు అభిప్రాయపడినట్టు రామచంద్రపురం ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ తెలిపారు. కోనసీమ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు పలు అంశాలను ప్రస్తావించడానికి సమావేశంలో నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు అక్కల రిష్వంత్‌రాయ్, అధికారి జయలక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, పెనుమల్ల లక్ష్మి, చింతపల్లి రామకృష్ణ, ఓగూరి భాగ్యశ్రీ పాల్గొన్నారు.



పదో తరగతి స్టడీ మెటీరియల్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెన్త్ స్టడీ మెటీరియల్స్ ఆవిష్కరణ

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్వర్యంలో ముద్రించిన పదో తరగతి స్టడీ మెటీరియల్స్ పుస్తకాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఆలమూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్వర్యంలో ముద్రించిన ఈ పుస్తకాల మోడల్ పేపర్లు విద్యార్థులకు సులువుగా అర్థం చేసుకునేలా తయారు చేయడంతో ఎంతో ప్రాముఖ్యత పొందుతున్నాయని పలువురు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రాజు, నాయకులు ఆకుల రామకృష్ణ, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్, బైరిశెట్టి రాంబాబు, పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

బ్రాహ్మణ సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ఆలమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల శ్రీసూర్య గాయత్రి బ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. చింతలూరులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షులుగా అల్లంరాజు రామకృష్ణమూర్తి, చల్లా సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడుగా మేడవరపు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా కూచిభట్ల శివ, మద్దూరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా వేదుల లక్ష్మణశర్మ, కోశాధికారి చర్ల కృష్ణ హనుమాన్‌తోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

అవగాహన సదస్సు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మోడరన్ ఇంటర్ విద్య అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్టు సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి అనంతరం ఇంటర్ విద్యలో తీసుకునే నిర్ణయం భవిష్యత్‌కు భరోసా నిలుస్తుందన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు మోడరన్ అందిస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ డైరెక్టరు సాయిరామ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

కపిలేశ్వరపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంగరలోనున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శ్రీ పుష్పోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కొమాళ్లపల్లి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావుల అర్చక పర్యవేక్షణలో శ్రీకంఠం మల్లేశ్వర శర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీపుష్పోత్సవాన్ని వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఈవో ఎం.శ్రీదేవి పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 6న ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు శ్రీ పుష్పోత్సవంతో ముగిసినట్టు ఆలయ ఈవో శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి

ఆత్రేయపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ కోరారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అమలాపురంలో డిసెంబరు 2న నిర్వహించే ఒక కార్యక్రమానికి వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు తరలిరావాలన్నారు. రావులపాలెంలోని కోనసీమ ముఖద్వారం వద్దకు ఆయా ప్రాంతాల నుంచి తరలిరావాలని ఆయన సూచించారు.



ఆర్జేసీ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న దేవదాయశాఖ ఆర్జేసీ

ఐ.పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాధరావు దంపతులు ఆదివారం మురమళ్ల వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆర్జేసీ దంపతులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఆర్జేసీ దంపతులకు ప్రత్యేక దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అందించారు. అసిస్టెంట్‌కమిషనర్ వి.సత్యనారాయణ ఆర్జేసీ దంపతులకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, అర్చకుడు ఉండి దత్తుశర్మ పాల్గొన్నారు.

మానవత ఆశ్రమంలో గీతా జయంతి



లొల్లలో భగవద్గీత పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో గీతా జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయవరానికి చెందిన వైద్యుడు డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ భగవద్గీతను తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు యోగా, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తూ భగవద్గీత నేర్పిస్తున్న శ్రీనివాసచౌదరిని వక్తలు అభినందించారు. భగవద్గీత పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రతిభ కనబర్చిన కె.వల్లి, ద్వితీయస్థానం సాధించిన కె.హరిప్రియ, తృతీయస్థానం సాధించిన కె.గణేష్ కార్తికేయ, జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం భార్గవ్, ద్వితీయస్థానం మోక్షశ్రీ, తృతీయ స్థానం సాన్వి, వివిధ పోటీల్లో విజేతలైన కె.విద్యా రామ్‌చరణ్, కె.తరుణ్ శివసాయి, షర్మిల, అక్షయలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యోగా గురువు వెలగల ఫణి కృష్ణారెడ్డి, మానవత సంస్థ కోఆర్డినేటర్ తులసి, మానవత విద్యాలయ ప్రతినిధి రాజేంద్ర, ఉపాధ్యాయులు కె.గోపాలకృష్ణ, వీర్రాజు, పాతూరి రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాకలో నేడు గీతా జయంతి: మండలంలోని వెదురుపాక గీతా మందిరం వద్ద సోమవారం గీతా జయంతిని నిర్వహించనున్నట్టు గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున 5 గంటల నుంచి భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం, శ్రీకృష్ణుడికి పూజలు, గీతా హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా చిన్నారులతో నృత్య ప్రదర్శనలు, అన్నసమారాధన జరుగుతుందని భక్తులు విజయవంతం చేయాలన్నారు.



ద్రాక్షారామలో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ద్రాక్షారామలో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

ద్రాక్షారామ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షను జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో 2,600 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష రాశారు. కొత్తపేట, అమలాపురం డివిజన్‌లలో కూడా పరీక్షలు నిర్వహించారు. రామచంద్రపురం డివిజన్‌కు ఎస్.పాపాయి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించగా, కోఆర్డినేటర్లు గణేష్, రాజశేఖర్ సహకరించారు. ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తామని సైన్సు జిల్లా అధికారి గిరిజాల సుబ్రహ్మణ్యం తెలిపారు.

కపిలేశ్వరపురంలో...

కపిలేశ్వరపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నమూనా పరీక్షకు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 8వ తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను ఉపాధ్యాయులు కెవీవీ సత్యనారాయణ, ఎం. రాంబాబు, గోవిందకుమార్ పర్యవేక్షించారు.



కపిలేశ్వరపురంలో విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం